

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక
(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 12 మార్చి, 2016 సంచిక : 10

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**ప్రధాన సంపాదకత్వం**
**శ్రీ మాతా శుకవాణి**
భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా.......... రూ॥ 160/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

**చిరునామా :-**

**సాయివాణి**
C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
నల్గొండ జిల్లా - 508 126.
**Ph : 9440413455, 9848133565**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
గురువాణి-3 .......... 5
అనుగ్రహమా-ఆగ్రహమా .......... 6
గోవు .......... 8
సుశ్లోకవాణి .......... 10
కబీరు అమృతవాక్కులు .......... 11
బింబం-ప్రతిబింబం .......... 12
నేనెవరు? ప్రశ్నకు రమణుల .......... 13
శ్రీ గజానన విజయం .......... 15
షిరిడీ డైరీ .......... 17
జగద్గురు తత్త్వబోధకస్వామి .......... 19
శుకవాణి .......... 22
గురుదేవుల జన్మదిన .......... 24
గురువుగారితో కబుర్లు .......... 25
మాతృసంస్థ కబుర్లు .......... 27
DECLARATION .......... 31
శిలారోదనం--1 .......... 32

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com







# మా వాణి



శ్రీ సాయినాథుల వారు తాము భక్తులకు అన్యాపదేశంగా ఎన్నో బోధలు చేసేవారు. కొన్నిసార్లు సూటిగానే చెప్పేవారు కూడా. తమ గురువు గురించీ, తాము పన్నెండేళ్లపాటు గురువును ఎలా సేవించారనేదాన్ని గురించీ ఎంతో చక్కగా చెప్పారు. (18-19 అధ్యాయాలు) అసలు తొలి అధ్యాయంలోనే హేమాడ్పంతు సాయిబాబా తిరగట్లో గోధుమలు విసురుతున్న సంఘటనను గురించి చెప్తూ కబీరు దోహా గుర్తు చేసుకున్నారు. “సంసారమనే తిరగటిలో పడి నలిగి పిండి పిండి అయిపోతాయి గింజలు. రాళ్లు తిరగడానికి ఆధారంగా ఉన్న గురుసు చుట్టూ అంటిపెట్టుకొని ఉన్న గింజలు మాత్రం నలగవు. గురువును దృఢంగా విశ్వసించి పట్టుకొన్నవారికి పతనం ఉండదు” అని వ్రాసారు. భక్తి, కర్మ యోగాలను అనుష్ఠిస్తూనే జ్ఞానాన్ని ఆశ్రయించుకొని ఉండాలని దానికి మరో భావం కూడా చెప్పారు వేత్తలు. దాము అన్నా మనసులో మెదిలిన సందేహాన్ని నివృత్తి చేస్తూ శ్రీ సాయి ఒకసారి యిలా చెప్పారు (25వ అధ్యాయం)-

“మామిడిచెట్టుకు పూచిన పూతంతా పళ్లుగా మారవు. కొంత పూత రాలిపోతుంది. పిందెలుగా గాలికి రాలిపోతాయి కొన్ని. ఇంకొన్ని కాయలయ్యాక ఏ రాళ్ల దెబ్బలకో, తుఫానుకో రాలిపోతాయి. మరికొన్ని దాదాపుగా పక్వస్థితికి వచ్చాక కూడా ఏదో కోతి తెంపటం చేతో, ఇంకే కారణం చేతో రాలిపోవచ్చు. ఇక, మిగిలేవి ఏవయ్యా అంటే ఆది నుండీ అంతం వరకూ గురువు అనే తొడిమను సుస్థిరంగా పట్టుకొని ఉన్నవే. అవి మాత్రమే పండుతాయి”. అంటే ఏ సంచలనానికీ, వ్యామోహానికీ లోను గాకుండా గురుబోధను అనుసరించి లక్ష్యంవైపు పయనించేవాడే తన సాధనలో సఫలీకృతుడవుతాడు-అని దీని అర్థం.

మరోచోట గురువు చెంతకు వెళ్లేవాడు తన మనసులో కేవలం ఆధ్యాత్మిక ప్రయోజనం పొందడానికే వెళ్లాలిగానీ, సకాముడై వెడితే ప్రయోజనం అక్కడితోనే ఆగిపోతుందన్న విషయం మద్రాసు భజన సమాజ యజమానికి (29వ అధ్యాయంలో) ఋజువు చేసారు. స్వార్థంతో, అహంతో సాయిని చేరవచ్చిన అతనికి స్వప్నంలో ఒక విచిత్రదర్శనం యిచ్చి, అతనికి తమ శక్తి అర్థమయ్యేలా చేసి, అతడు నమస్కారం చేస్తే "మునుపటి నమస్కారానికీ, దీనికీ ఏమైనా భేదం ఉన్నదా?" అని అడిగి, అతనిచేతనే మునుపటి నమస్కారం ధనం కోసం కపటంతో చేసిందనీ, అప్పుడు చేసినది భక్తితోననీ చెప్పించారు. ఇవన్నీ మనకు పాఠం నేర్పడానికే గదా!

సర్వకాల సర్వావస్థలలోనూ గురుశక్తి శిష్యరక్షణకై సిద్ధంగానే ఉంటుంది. కానీ, శిష్యునిలో అది స్వీకరించే ఏకాగ్రత, భక్తి, శ్రద్ధ ఉండాలి. గురువు శిష్యుడి శక్తిని సమగ్రంగా అంచనాకట్టి, అతనికి సరిపడే శిక్షణను, లక్ష్యాన్ని, లక్ష్యానికి అనుగుణమైన సాధనను అనుగ్రహిస్తాడు. దానికి శిష్యుడు మనసా, వాచా, కర్మణా కట్టుబడి ఉండాలి. అలాకాక తన తర్కానికీ, తాను నేర్చుకొన్న లౌకిక విద్యలకూ విలువ ఇచ్చి, తన సొంత స్కేల్ (కొలమానం)తో గురుబోధను కొలిచి, మరేదో మార్గానికి పరుగులు తీసే శిష్యుడు తన బుద్ధికికాక మనసుకు పగ్గాలిచ్చినట్లు. "వీరికంటే వారు బాగా చెప్తారు. వారికంటే వీరు ధ్యానం బాగా నేర్పుతారు" ఇలాంటి పోలికలు గురువుతో తేవటాన్ని మించిన మహాపచారం మరొకటి లేదనటం నిర్వివాదం.

ఆముక్తమాల్యదలోని మాలదాసరి కథ యిందుకు సాక్షి. ఒక్కసారి గుడికి వెళ్లి తాను చేసే నిత్యసంకీర్తనం చేసి తిరిగి వస్తాననీ, అప్పుడు తనను భక్షించమనీ వేడుకొన్నాడు. మాల దాసరి తనను పట్టి తినబోతున్న బ్రహ్మరాక్షసునితో. అతడు నమ్మలేదు. ఎన్నివిధాల ప్రాధేయపడినా లొంగలేదు-దాసరిని వదలలేదు. చివరికి దాసరి తాను కొలిచే దైవంతో






పరదైవాన్ని పోల్చినవాడు పోయే నరకానికి పోతాను-ఆడి తప్పితే"-అని ఒట్టు పెట్టుకున్నాడు. అప్పుడు వదిలాడు బ్రహ్మ రాక్షసుడు. గురువూ, దైవం ఒక్కటే గదా! దైవాన్ని పరులతో పోల్చడం పాపమైతే గురువును పోల్చి చూచుకోవటం, చూపు ప్రక్కకు తిప్పటం పాపం కాదా?

ప్రాచీనగాథ ఒకటి ఉంది. సముద్రంలో ఓడ వెళ్తుంది. ఆ ఓడపైని జెండా మీద ఒక రామచిలుక కూర్చుంది. ఓడ సముద్రం మధ్యలోకి వెళ్లింది. ఎంతసేపటికీ నేలరాదు, చెట్లు కనపడవు. చిలుకకు విసుగు పుట్టింది. తనంతట తానే ఎగిరి వెళ్లిపోయి తీరానికి చేరదాం అనుకున్నది. తూర్పు దిక్కుగా కొంతసేపు ఎగిరింది. అనంత జలరాశి తప్ప ఏమీ కనపడ లేదు. చిలక దక్షిణానికి తిరిగింది. తీరం కనిపించనే లేదు. ఇక పడమటికి తిరిగింది. ఆకాశం సముద్రం కలిసేచోటు తప్ప మరేమీ కనబడటం లేదు. అలాగే కాసేపు ఉత్తరాన కూడా ఎగిరింది. బాగా అలసిపోయి, వెనక్కు వచ్చి ఓడ మీద వాలి నిశ్చింతగా ఉండిపోయింది. కొద్దిరోజులు గడిచాక ఓడ తాను తీరానికి చేరడమే కాక చిలుకను కూడా ఒడ్డుకు చేర్చింది.

మూఢుడైన శిష్యుడు అర్థంలేని ఆరాటంతో ఎక్కడెక్కడో తిరుగుతాడు. అది అతని మనసు చేసే మాయ. ఏవేవో సాధించాలని తొందర తొందరగా, పదిరకాలుగా పరుగుతీసి, తనతోపాటే అతనిని కూడా చంచలుడిని చేస్తుంది అతని మనసు. సరియైన సాధకుడు గురువును తనకు దైవం ప్రసాదించిన వరంగా భావించి ఆయన ద్వారా ముక్తి సోపానాలు ఎలా ఎక్కాలో నేర్చుకుంటాడు. లౌకికమైన కాంక్షలతో గురువు చెంతచేరి అవి తీరలేదనో, తనకు సరియైన విలువ లేదా ఆదరణ లభించ లేదనో దూరంగా జరిగే మూఢుడు మేరు పర్వతం దగ్గరకు వెళ్లి గోటితో బంగారం గిల్లుకోవడం కుదరలేదని అలిగిన పసివాడి వంటివాడు. తల్లి తాబేటిని ఏకాగ్రదృష్టితో చూడక నత్తలను, పీతలను, చేపలను చూస్తూ ఉండే తాబేటి పిల్లకు శక్తి వచ్చేనా?



# గురు వాణి-3

చాలామంది అనేక రకాల ఒత్తిడులతో, యిబ్బందులతో ఆరాటపడుతూ ఉంటారు. వారు పదేపదే శాంతి లేదు- శాంతి లేదు అంటూ ఉంటారు. "నాకు శాంతి కావాలి" యీ వాక్యంలోనే పెద్ద చమత్కారం ఉంది. 'నాకు' యీ మాట చూద్దాం! నాకు అంటే ఎవరికి? "నేను"కు. నేనెవరు? నేను అంటే శరీరమా? మనసా? బుద్ధా? ఏమిటది? నా కాలు, నా చెయ్యి అంటాం. అంటే చెయ్యి, కాలు, కన్ను, ముక్కు వగైరా అవయవాలన్నీ నావి. అంటే "నేను" వీటికంటే భిన్నంగా ఉంది. అలాగే నా బుద్ధికి తోచినట్లు, నా మనస్సు అంగీకరించడం లేదు-ఇలా అంటుంటాం. అంటే మనస్సు, బుద్ధి మొదలైనవి నావే. కానీ "నేను" కావు. మరి యింతకీ "నేను" ఎవవు? వీటన్నింటికి భిన్నమై నీలోపల, నీ ఉనికికి ఆధారభూతమై ఉన్న చైతన్య శక్తే "నేను". ప్రతి జీవిలోను నామరూపాలను మినహాయిస్తే మిగిలేది ఆ చైతన్యం లేదా ఆత్మ. ఇదే అసలైన "నేను". ఆత్మ దేనివలనా పొంగదు, దేని వలనా కుంగదు-అని సకల శాస్త్రాలూ ఘోషిస్తున్నాయి. అలాంటప్పుడు దానికి శాంతి, అశాంతి ఎక్కడివి?

మరోమాట "కావాలి" చూద్దాం. ఆ మాటకు అర్థం కోరుకుంటున్నాను అని. 'కోరిక' దేనికి? శరీరానికా, మనసుకా, ఆత్మకా? కోరిక లేదా ఆశే దుఃఖాలన్నింటికీ మూలం. కావాలనుకున్నది దొరకకపోయినా బాధే, దొరికి జారిపోయినా బాధే. లోకంలో ఏదీ శాశ్వతం కాదు కనుక నీవు పొందిన 'ఏదైనా' ఏదో ఒకనాటికి నిన్ను విడిచిపోకా తప్పదు, నీకు బాధ కలిగించకా తప్పదు. "ఆశాపాశము కడున్ నిడువు లేదంతంబు" అన్నారు పెద్దలు. అంచేత "కావాలి" వలన ఆనందమూ ఉండదు, దానికి అంతమూ ఉండదు. పైన చెప్పకున్న "నాకు"లో స్వార్థం ఉంది. పైగా నీవు కాని దానిని





నీవుగా భ్రమిస్తున్న అజ్ఞానమూ ఉంది. "కావాలి"లో అంతులేని ఆరాటమూ ఉంది, అనిత్యత్వమూ ఉంది. ఈ రెండింటినీ తీసేస్తే ఆ వాక్యంలో ఇక మిగిలేది "శాంతి" ఒక్కటే కదా? అదే ఉపాయం శాంతి పొందడానికి.

అసలు 'నాకు శాంతి కావాల'న్న భావనే తప్పు. నీవు (ఆత్మ), శాంతి స్వరూపుడవే. ఏ దుఃఖాలూ, ఆరాటాలూ, బాధలూ ఆత్మకు సహజంగానే లేవు. కానీ దేనినో నువ్వనుకొని, దానికి అంటినవన్నీ నీవు అంటించుకొని, అశాంతిని కోరి తెచ్చుకుంటున్నావు. అందుచేత పైన అంటుకొన్న స్వార్థ భావనను, ఆశలను దులిపేసుకుంటే, ఎటువంటి అశాంతీ నిన్ను అంటదు. నీ కర్తవ్యనిర్వహణకు ఏది, ఎంత అవసరమో అంతవరకే ఐహిక విషయాలను (బంధాలను) స్వీకరించు. అటుపైన నిర్లిప్తంగా-తామరాకు మీది నీటి బొట్టులాగా, చేతికి నూనె రాసుకొని పనస తొనలు ఒలిచే వాడిలాగా ఉండు. అప్పుడు నీకు ఉండేదంతా శాంతే! అసలు నీకు శాంతి ఉండటమేమిటి? నీవే శాంతి. అలాంటి శాంతి స్వరూపం సాయినాథుడు మీకందరికీ అనుగ్రహించుగాక!

# అనుగ్రహమా-ఆగ్రహమా

**- మాతాజీ**

ఓసారి శ్రీకృష్ణుడు గరుత్మంతుని పిలిచి, కుబేరుడి ఉద్యానవనంలో నుంచి సౌగంధిక పుష్పాలు తెమ్మని ఆజ్ఞాపించాడు. రివ్వున ఎగిరిపోతున్న గరుడునిలో అహంకారం తలెత్తింది. "నా అంత వేగంగా వెళ్లగలవారు మరొకరు లేరు. స్వయంగా శ్రీమహావిష్ణువునే వెన్నున ఎక్కించుకొని ఎగర గల బలశాలినిని నేను. నాకు సాటి మరెవ్వరూ రారు. అందుకే కృష్ణుడు నన్ను యింతగా గౌరవించడం" - అలా ఏవేవో ఆలోచిస్తూ గంధమాదన పర్వతం చేరుకున్నాడు గరుడుడు, సౌగంధిక పుష్పాలు కోయసాగాడు.

అదే సమయానికి హనుమంతుడు అక్కడికి వచ్చాడు-శ్రీరామ నామాన్ని జపిస్తూ "పక్షి రాజా! యీ పువ్వులు ఎవ్వరి కోసమయ్యా? యీ తోట కుబేరుడిది కదా! ఆయన అనుమతి తీసుకున్నావా?" అని ప్రశ్నించాడు.

అహంకారంతో కన్నుగానని గరుత్మంతుడు "నేను శ్రీకృష్ణుల వారి ఆజ్ఞ మేరకు ఇవి కోస్తున్నాను. నాకు ఎవ్వరి ఆజ్ఞా అక్కరలేదు" అని నిర్ల క్ష్యంగా జవాబు చెప్పాడు. ఆ జవాబుకు హనుమంతుడు మండిపడ్డాడు. వెంటనే గరుడుని ఒడిసిపట్టి చంకలో పెట్టుకున్నాడు. అదే కోపంతో ద్వారకకు వెళ్ళాడు. అతడి వేగాన్ని అడ్డుకోవడానికి సుదర్శన చక్రం హనుమంతుని మీదికి వచ్చింది. హనుమ దాన్ని కూడా పట్టుకొని మరో చంక క్రింద పెట్టుకున్నాడు. ఇదంతా చిద్విలాసంగా చూస్తున్న కృష్ణుడు తన భార్యలందరినీ పిలిచాడు. "అడుగో, హనుమంతుడు కోపంతో వస్తున్నాడు! సీతా, రామ దర్శనంతో కాని ఆయనకు ఆ కోపం ఆగదు. నేను శ్రీరామరూపం ధరిస్తాను. మీలో ఎవ్వరయినా సీతాదేవి రూపు ధరించండి" అన్నాడు. అలా అంటూనే కృష్ణుడు శ్రీరాముడు అయి పోయాడు. కాని ఆయన దేవేరులు ఎంత ప్రయత్నించినా సీతమ్మలు కాలేకపోయారు. అందుచేత అందరూ వెళ్ళి రాధాదేవిని పిలిచారు. సంగతి విన్న రాధ చటుక్కున సీతమ్మగా మారిపోయింది. కృష్ణుని ప్రక్కన కూర్చుంది. హనుమంతుడు వచ్చి సీతామాతకు, రామయ్యకు నమస్కరించాడు. పరమానందంతో, కన్నీళ్ళతో వాళ్ళను చూస్తూ ఉండిపోయాడు.

శ్రీరాముడు (కృష్ణుడు) హనుమను ఆశీర్వదిస్తూ "నాయనా, నీ చంక క్రింద ఏవో ఉన్నట్లున్నవి ఏమిటవి?" అని ప్రశ్నించాడు. హనుమ వినయంతో యిలా అన్నాడు. "ఏమీ లేదు స్వామీ! నేను గంధమాదన గిరి మీద ఒంటరిగా కూర్చొని జపం చేసుకుంటున్నాను. అప్పుడు ఒక చిన్న పక్షి నాకు భంగం కలిగించింది. అందుకని దానిని పట్టుకున్నాను.





అంతలో ఓ చిన్న చక్రంలాంటిది కాళ్లకు అడ్డుపడింది. దాన్ని కూడా యిలా పట్టుకు వచ్చాను. అయినాగానీ, మీకు పువ్వులు కావాలంటే నాకు ఆజ్ఞ యివ్వవచ్చు కదా స్వామీ! ఆ అల్పపక్షి అత్యంత బలపరాక్రమశాలి అయిన కుబేరుని తోట నుండి పువ్వులేమి తేగలదు పాపం" అన్నారు.

అది విని పరంధాముడు చిరునవ్వుతో, "పాపం వాళ్లను వదిలి వెయ్యి హనుమా! నీ యీ పని నాకు ఆనందాన్ని కలిగించింది. ఇక నువ్వు మళ్లీ ధ్యానానికి వెళ్లిపోవచ్చు" అన్నాడు. హనుమంతుడు అలాగే గరుడుని, చక్రాన్ని విడుదల చేసి శ్రీరామ, జయరామ అని పాడుకుంటూ వెళ్లిపోయాడు. గరుత్మంతుడు తన వేగాన్ని గురించీ, సుదర్శన చక్రం తన ప్రభావాన్ని గురించీ, శ్రీకృష్ణుని భార్యలు తమ సౌందర్యం గురించీ, పొందిన అహంకారమంతా శ్రీకృష్ణుని యీ చిన్న అనుగ్రహ హేలతో అణగారిపోయాయి.

# గోవు

**- శ్రీశ్రీశ్రీ మాతా నిర్మలాంద యోగ భారతి వారు**

గోవు అనే పదానికి కేవలం ఆవు అనేగాక ధర్మం, భూమి అనే అర్థాలు కూడా ఉన్నాయి. గోవును నాశనం చెయ్యటం, కడుపు నింపుకోవడానికి గోమాంస భక్షణం అంటే ధర్మాన్ని నాశనం చెయ్యడం, భూమిని దిగమ్రింగడం అన్న అర్థాలు కూడా వస్తాయి. పొదుగుకోసి పాలు త్రాగడం అని ఒక నానుడి ఉన్నది. అంటే చెట్టును మూల విచ్ఛేదం చేసి పండ్లు రావాలని ఆశించడం వంటిది. అనాదిగా ద్రష్టలైన మన ఋషులు గోవు ఘనత గురించీ, దాని వలన మనం పొందగల ప్రయోజనాలను గురించీ ఎన్నో విషయాలు చెప్పారు. అవి తెలుసుకొంటే-చేజేతులా మన సౌభాగ్యాన్ని మనమే నాశనం చేసుకోము. చదవండి -

ప్రతి ప్రాణి ప్రయోజనమూ కొనియాడుతూ గోవు యొక్క వైశిష్ట్యము గొప్పతనము కూడ మన వైజ్ఞానికులు కొనియాడారు. మహర్షి ధన్వంతరి, చరకుడు, సుశ్రుతుడు, వాగ్భటాచార్యుడు యిత్యాది విశేషజ్ఞులు గోవు మహత్త్వమును వివరించారు.

మహర్షి చరకుడు ప్రపంచ వైద్యశాస్త్రకారులలో ప్రథమునిగ ఘనత పొందినవాడు. వారు గో ప్రయోజనాలలో గో-ఘృతము గురించి యీ విధముగా వర్ణించారు.

"స్మృతి బుద్ధ్యగ్ని శుక్రౌజః కఫమేధో వివర్ధనమ్"

ఆవు నెయ్యి జ్ఞాపకశక్తిని, శుక్రకణములను, ఓజో గుణమును, కఫమును, శరీరమును వృద్ధిచేస్తుంది.

"వాత పిత్త విషోన్మాద శోషాలక్ష్మీ జ్వరాపహమ్"

ఇది వాత రోగాలను, పిత్త రోగాలను, విషమును, ఉన్మాదమును, వాపులను అలక్ష్మీ (అనారోగ్యం) జ్వరమును నివారణ చేస్తుంది.

"సర్వ స్నేహోత్తమం, శీతం మధురం రసపాకయోః"

-గో ఘృతము అన్ని చమురుపదార్థములలో కన్న ఉత్తమమైనది, శీతలమైనది, మధురమైనది మరియు అది రసాయనము, శరీరంలోని సమస్త ధాతువులను కాపాడునది.

"సహస్ర వీర్యం విధిభిర్ ఘృతం కర్మ సహస్రకృత్"

అసంఖ్యాక విధాలుగా వీర్యశక్తినిచ్చునది, అనేక విధానాలతో అసంఖ్యాకముగ మేలు చేయునది. రోగములను హరించునది. సుఖములనిచ్చునది. వారు గోవు పాల-గొప్పతనము కూడ యీ విధముగా వ్రాసారు.

"ప్రవరం జీవనీయానాం క్షీరముత్తమమ్ రసాయనమ్"

(జీవనశక్తి గల పదార్థాలన్నింటిలోను ఆవు పాలు అత్యంత జీవనీయ (ప్రాణశక్తినిచ్చే) తత్వము గలవి) అని మహర్షి వ్యాసులు వ్రాసారు. అమృతం వై గవాం క్షీరమ్" ఆవు పాలు కేవలము పాలే కావు అమృతమని, అదే





విధముగా ఋషులు పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, గోమయము, గోమూత్రము యొక్క ప్రయోజనాలనెన్నో విధములుగా వ్రాసారు. నేడు అమెరికా, చైనా వారు కూడా గోమూత్రం, గోమయం, క్రిమినిరోధాలుగా కనుక్కోవడం మనం వార్తాపత్రికల ద్వారా చదివాము. ఇంత తెలిసి కూడా గోమాంసం కోసం తగువులాడుకొందామా? వంట కట్టెల కోసం కల్ప వృక్షాన్ని నరుక్కుందామా! ఆలోచించండి!

## సుశ్లోకవాణి

- శుకవాణి

**"గంగా పాపం, శశీ తాపం, దైన్యం కల్ప తరుస్తావత్।**
**పాపం, తాపంచ, దైన్యంచ హంతి సజ్జన దర్శనమ్॥**

గంగ శ్రీవిష్ణు పాదాలలో జన్మించింది. స్వయంగా పరమాత్మ పాద జన్యం గనుక సకల పాపాలనూ పరిహరించగలదు. జాబిల్లి చల్లని వెలుగు శరీరానికున్న వేడిని తగ్గించి చలువనిస్తుంది. ఆయన అమృత కిరణుడు గదా మరి! కల్పవృక్షచ్ఛాయలో కూర్చొని ఏది కోరితే అది లభిస్తుందని శాస్త్రోక్తి. అయితే మనం యోగ్యమైనవే కోరుకోవాలి. మానవసహజమైన చాంచల్యం వలన ఏవేవో కోరుకుంటే-అవి కూడా తీర్చేస్తుంది కల్పవృక్షం. దానితో మనకు కీడు కలగవచ్చు.

పైన చెప్పినవి ఒక్కొక్కటీ ఒక్కొక్క ప్రయోజనాన్ని కలిగిస్తాయి. కానీ, సాధు సందర్శనం మాత్రం అన్ని ప్రయోజనాలనూ కలిగిస్తుంది. పరమ పావనులైన సత్పురుష సాంగత్యం మన లోపలి పాపచింతనలను తొలగించగలదు. ఐహిక తాపాలను ఉపశమింపజేయగలదు. యోగ్యమైన కోరికలే కోరేలా చేసి అవి తీర్చనూ గలదు. అందుచేత సాధు సత్పురుషులను వీలైనప్పుడంతా దర్శించండి. తరించండి.

సర్వం సాయిమయం

# కబీరు అమృత వాక్కులు

- తిరుమలశెట్టి వేంకట సుబ్బారావు, కొవ్వాడ

కబీరు నోటి నుండి అమృతవాక్కులా వెలువడిన దోహా ......

**దోహా॥ దాతా 'తర్‌వర్', ధయాఫల్, ఉపగారీ జీవంత్ !**

**పంఛీ (పంచీ-పక్షీ) చలేది సావర్, వృక్ష సఫల్ ఫలంత్ !!**

మహా ఫలవృక్షం, దయ అనే ఫలాలను ప్రసాదిస్తుంటుంది. ఈ వృక్షం అనే పదంలో కబీరు దాసు పరమాత్మ రూపాన్నే వృక్షంగా వర్ణించాడు. దయా ఫలాలను సమృద్ధిగా యిస్తాడాయన. కాని ఆ వృక్షాన్ని ఆశ్రయించుకున్న వివిధ జాతి పక్షులు ఆ దయా ఫలాలతో తృప్తి చెందక, దశదిశలూ పరుగెడుతుంటాయి. ఆపదలు కొని తెచ్చుకుంటాయి. దయాళువైన పరమాత్మను (వృక్షాన్ని) వదలి దూరంగా పరుగెడుతుంటాయి.

ప్రపంచంలో ఏ వస్తు సముదాయము, ఏ ఐశ్వర్యము, ఏ సౌఖ్యము యివ్వలేని మహదానందాన్ని సద్గురువు-సద్గురు కృప ప్రసాదిస్తాయి.

**సాయి శరణం - బాబా శరణం**

**బాబా శరణం - సాయి శరణం**







# బింబం-ప్రతిబింబం

- శ్రీ ఎం.వి. మాధవరావు

మనం అద్దంలో ముఖం చూచుకొంటాం. మన ప్రతిబింబమే అందులో కనిపిస్తుంది. ప్రతిబింబం మీద ఏదో నల్లగా కన్పించింది. అద్దం గట్టిగా తుడిస్తే ఆ మచ్చపోతుందా? తడిబట్టతో తుడిచినా లాభం ఉండదు. మనం విసుక్కుంటాం. అది కూడా విసుక్కొంటుంది. నవ్వుతాం-అదీ నవ్వుతుంది. కోపంగా కళ్లురిమి చూస్తాం-అదీ అలాగే చూస్తుంది. సరదా పడి మనం ఏడిస్తే అది కూడా ఏడుస్తుంది. (నిజంగా ఏడుపొస్తే అద్దంలో చూచుకొంటూ ఏడవంగా మరి!) మనం ఏం చేస్తే అదే చేస్తుంది మన ప్రతిబింబం. మనం ఏం అలంకరించుకొంటే అవే కన్పిస్తాయి అద్దంలో.

ఈ సృష్టిలో బింబం భగవంతుడు. మనం ప్రతిబింబాలం. ఆయన నిరాకారుడు. కానీ మనకు ఆకృతులున్నాయి. మరి, అదెలా? సాకారో పాసనతో గానీ మనకు తృప్తి కలగదు. అందుచేత నచ్చిన ఏదో ఒక రూపాన్ని పూజకు ఉపయోగిస్తాం. దానికి పూలు పెడతాం-మన జీవితం పరిమళిస్తుంది. దాన్ని ఆరాధనకై అలంకరిస్తాం. మనకు సుగుణాలంకారాలు వస్తాయి. అభిషేకం చేస్తాం-మనోనైర్మల్యం వస్తుంది, మనకు వ్యాధులు పోతాయి. నివేదన పెడతాం-మన జీవితం నిండుతుంది శాంతితో. అయితే యిదంతా ఎప్పుడు? మనం ఆరాధించే ఆ విగ్రహం లేదా పటం బింబమనీ, ఆయనను ఆరాధించే రీతులన్నీ మన కోసం మనం చేసుకొనేవనీ-అంటే మనకు మంచి జరగడానికేననీ స్పృహ ఉన్నంతవరకే. కానీ, మనం అత్యంత సహజంగా యివన్నీ మరిచిపోతాం. మననే (అంటే ప్రతిబింబాలనే) అలంకరించుకొంటాం. మనకే నివేదనలు, వస్త్రాలు, కానుకలు, మైపూతలు, సొగసులు, కీర్తనలు (పొగడ్తలు) అన్నీ మనకే. అవి బాగా కనిపించాలని అద్దాలను (మన బ్రతుకుటద్దాలను) ఎంత తుడిచినా ప్రయోజనం ఉండదు. స్వామినే సేవిద్దాం, తరిద్దాం. అదొక్కటే మనకు నిత్యస్మరణం, భవాబ్ధితరణం.

# 'నేనెవరు?' ప్రశ్నకు శ్రీ రమణుల సమాధానము

- సాధక మౌనానంద

'నేను' అన్న భావంతోనే జీవి జీవుడవుతున్నాడు. ఒక రూపములో కూడిన జీవి నేను అన్న భావము లేక వ్యవహారము ఏయలేదు, సుఖమును, దుఃఖమును అనుభవించలేదు. 'నేను' తొలి భావము, నాకు, నాదీ మలి భావనలు.

నా శరీరం, నా కన్ను, నా చేయి అనగానే శరీరం, కన్ను, చేతులకు భిన్నంగా 'నేను' ఉన్నానన్న భావము ఏర్పడి కనబడకుండా ఉన్న నేనును కనుక్కోవాలన్న భావము, కోరిక ఏర్పడినాయి.

నేను అన్నది ఒక భావమే. అది అన్య పదార్థ సంబంధముతోనే పుట్టి, కొంతసేపుండి, సంబంధము తెగిపోగానే మాయమవుతుంది. ఇది అర్థమైతే జీవితకాలంలో ఎన్ని నేనులు పుట్టి, మాయమవుతాయో అర్థమవుతుంది. నిజానికి నీవు, నేను రెండూ లేవు. అవి కేవలం భావాలే.

ఇది అర్థం కాని వాళ్లకు ఎంత చెప్పినా 'నేను ఎవరు?' అన్నది తెలుసుకోవాలన్న తపనపోలేదు. కాబట్టి శ్రీ రమణులు ఇక లాభం లేదని, తనని ఆశ్రయించిన వాళ్లకు 'నేనెవరు?' అన్న ప్రశ్న ఎక్కడ నుండి పుడుతుందో కనుక్కోమని చెప్పారు. మనస్సే యీ ప్రశ్నను పుట్టించింది కాబట్టి, మనస్సుకే యీ ప్రశ్నను వేస్తే, మనసు శాంతించి, ప్రశ్నే లేకుండా చేస్తుంది. అపుడు మౌనమే (నిశ్శబ్దమే) ఉంటుంది. ప్రశ్న లేకుండటయే శాంతి. మనస్సెపుడూ బాహ్యాప్రపంచంలో విహరించి విషయ సంగ్రహణ చేసుకొంటూ, బరువును పెంచుకొంటూ కష్టపడుతుంది.

శ్రీ రమణులు కూడా జపతపాలు నిజమైన శాంతిని, ముక్తిని యివ్వవనీ, వ్యవహార ప్రపంచానికి దూరంగా ఉండటానికి ఉపయోగ పడతాయనీ చెప్పారు. మనోనాశమే ముక్తి. ప్రాణాయామం మనసు లోబడుటకు సహాయం చేస్తుందేకాని నాశనము చేయదు అన్నారు.





గురువు ముక్తిమార్గమును చూపునేకాని ముక్తినివ్వజాలడన్నారు. శాస్త్రములను సదా చదవడం వల్లను, వల్లె వేయడం వల్లను ముక్తి రాదన్నారు. ఇవన్నీ భవనాధిరోహణకు మెట్లు మాత్రమే.

ఆత్మ విచారమనగా మనస్సును సదా ఆత్మలో నిలుపుటయే. నేర్చుకొన్న వాటినన్నింటిని ఎప్పటికైనా మరచిపోవాలి. అలాగే పట్టుకొన్న వాటినన్నింటినీ వదలిపెట్టాలి. 'చిత్తవృత్తి నిరోధః యోగః' అన్నదానినే శ్రీ రమణులు మరొక విధంగా చెప్పారు. కాని చాలామందికి అర్థం కాలేదనే చెప్పాలి. మనస్సును ప్రపంచంవైపు మళ్లించకు అని చెప్పడం బాగుంది, వినడానికి బాగుంది. బహుశః శ్రీరమణుల వంటి వారికే చెల్లుతుంది. సామాన్య మానవునకు కుదరదు. చేతిలోని గారె చేతిలోనే ఉండాలి, అయినా తినాలి అంటే కుదరదు గదా! తింటే ఉండదు, ఉంటే తినలేవు. ప్రపంచంలోనే ఉండాలి, కాని ముక్తుడనవ్వాలి అంటే కుదరదు. ఇది నచ్చదు కాబట్టి, ప్రపంచంలో ఉన్నా, అది నిన్ను పట్టుకునే అవకాశం యివ్వకూడదు అన్న సలహా యిస్తారే కాని, సాధన సాధ్యము కాదు.

మొదట సత్యమర్థమవ్వాలి. దైవప్రణాళిక రకరకాలుగా రూపాన్ని మార్చి, భ్రమను కల్పించి, అసత్యాన్ని సత్యంగా భావించే విధంగా మనల్ని ప్రభావితం చేస్తుంది. ఇది తెలియనంత వరకు దుఃఖమే, తెలిస్తే దుఃఖం లేదు. అదే ముక్తి. మనస్సు బయట విహరిస్తే బంధం, దుఃఖం. అంతర్ముఖమైతే, అంటే ఊరక ఉంటే శాంతి, ముక్తి. సత్యం అర్థమవడం కాదు ముఖ్యం. అర్థమై విషయలంపటం వదలగలగటమే ముఖ్యం. సూక్ష్మగ్రాహికి ఒక్క వాక్యం, ఒక్క శబ్దం చాలు. ఇతరులకు కథలు, వివరణలు కావాలి. అందుకే ఉపనిషద్వాక్యం-"మన ఏవమనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అనగా బంధానికిగాని, ముక్తికిగాని మనస్సే కారణం, ఆధారం కూడా.

నిజంగా ముక్తిని కోరేవాడు ప్రపంచాన్ని చూడడు. ముక్తిని పొందిన వానిని ప్రపంచము భయపెట్టజాలదు. పాఠకులందరూ ముక్తిమార్గాన్ని అనుసరించి ముక్తులవ్వాలని కోరుకుందాం. -: శుభమ్ :-

# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

## 13వ అధ్యాయం

గజాననుల ఆశ్రమం నిమిత్తం బంకట్‌లాల్, హరి, లక్ష్మణ్, విఠు, జగదేవ్ మొదలైన శిష్యులంతా చందాల కోసం యింటింటికీ తిరగసాగారు. చాలా మంది సానుకూలంగానే వ్యవహరించారుగానీ కొంతమంది తలతిక్కగా మాట్లాడసాగారు.

"మీ మహరాజుకు డబ్బెందుకు? తన దివ్యశక్తులతో సృష్టించుకోలేడా? కుబేరుడే ఆయనకు ధనం యిస్తాడని మీరంటారు గదా-మరి ఆ బిల్లేదో అతనికి పంపవచ్చుగా! ఇలా కొంపల వెంట తిరిగి అడుక్కోవటం దేనికి?" ఇలా ఉండేవి వాళ్ల మాటలు. వారికి జగదేవ్ యిలా జవాబిచ్చాడు -

"చూడండి బాబూ! మేము మీ ప్రయోజనం కోసమే మిమ్మల్ని అడుగుతున్నాం. మహరాజుకు మఠమే అవసరం లేదు. ముల్లోకాలూ ఆయన నివాసమే. అడవులన్నీ ఆయన ఉద్యానాలే. ఈ పృథ్వీతలమంతా ఆయనకు పడకే. అష్టసిద్ధులు ఆయన చిటికె వేస్తే వస్తాయి. అలాంటి వారికి మీ రూపాయలు దేనికి? సూర్యుడిని ఎవరైనా దివిటీతో చూపించాలా? ఆయనే స్వయంప్రకాశకుడైన తేజోమూర్తి. అతనికి దీపం అక్కరలేదు. ప్రతి వాడికీ ఒక భాగ్యం, అదృష్టం కావాలి. ఒక సత్కర్మ అభ్యుదయాన్ని కలిగిస్తుంది. ఒక రోగాన్ని నయం చేయడానికి ఒక మందు కావాలి. కానీ ఆ మందు శరీరాన్నే తప్ప జీవితాన్ని (ఆత్మను) ప్రభావితం చేయలేదు. ఆత్మ శాశ్వతమైనది. దానికి చావూ, పుట్టుకా లేవు. కాబట్టి మనకు అభ్యుదయం కావాలంటే ఏదో ఒక సత్కర్మ చేసి తీరాలి. అంచేత చెత్త ఆలోచనలు నెట్టేసి, ఉత్తమత్వంవైపు నడవండి. మీరు మంచికర్మలను





నాటితే అవి వెయ్యింతలై మీకు ఫలితమిస్తాయి. రాతి మీద వేసిన గింజ మొలకెత్తదు. చెడు కర్మలు, దుష్ట యోచనలు శిలల వంటివి. అక్కడ వేసిన గింజలు వ్యర్థమై పురుగుల పాలవుతాయి. ఒక సాధు పురుషుని సేవించటంతో సమమైన సత్కర్మ మరేదీ లేదు. గజాననులు పావన పురుషులలో మేలిమిరత్నం వంటివారు. ఆయనకు చేసిన సేవ అనంతమైన ఫలితాలిస్తుంది. ఒక గింజ నాటితే వేలాది గింజలు వచ్చినట్లే యిదీ ఫలిస్తుంది". ఈ జవాబుతో అంతా సానుకూలమైనారు. భక్తులంతా సమైక్యంగా పని చేయటంతో కలెక్టర్‌గార్చిన భూమిపైన పని ప్రారంభమైంది. రాళ్లు, గానుగ సున్నం అన్నీ సిద్ధమైనాయి. కొద్దిరోజులు గడిచాక పని నెమ్మదిగా సాగుతున్నట్లనిపించింది మహరాజుకు. ఓ రోజు ఇసుక తీసుకువెళ్లే బండిలో ఎక్కి కూర్చున్నారు. బండి తోలేవాడు మహర్ జాతివాడు. అతడు గభాల్న బండి దూకి, "అయ్యా, తమరితోపాటు నేను కూర్చోలేను. శ్రీరామునిలో లీనమైపోగలిగిన మహాభక్తుడు హనుమంతుడు కూడా ఎన్నడూ రామచంద్రుని సరసన కూర్చోలేదు - చేతులు జోడించి ఎదుట నిలవటం తప్ప!" అన్నాడు. గజాననుల ఎడ్లతో 'అతని వెంట నడవండి' అనగానే అవి అలాగే చేసాయి. మహరాజు నిర్మాణస్థలానికి చేరి మధ్యలో నేల మీద కూర్చున్నారు. ఆ స్థలం 700 సర్వే నంబరులో 43, 45 విభాగాల్లో ఉంది. కలెక్టరిచ్చింది ఎకరమే అయినా అంతకన్నా ఎక్కువ నేల ఉపయోగించుకొంటున్నారు- 11 గుంటల భూమి దురాక్రమణ అయినట్లు. ఎవడో ఒక దుష్టుడు యీ విషయం కలెక్టర్‌కు ఉప్పందించాడు. పరిశోధనకు జోషీ వచ్చాడు. హరిపాటిల్ కొద్దిగా యిబ్బందిపడి మహరాజ్‌తో యీ మాట చెప్పాడు.

గజాననులు "ఏమీ దిగుల్లేదు. మనకు జరిమానా ఏమీ పడదు" అని నవ్వారు. జోషీ జరిమానా అవసరం లేదని వ్రాయటంతో సమస్య తీరిపోయింది. మహరాజు మాటలు నిజమయ్యాయి.

**(సశేషం)**



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

**- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే**

**అనువాదం : మాతా శుకవాణి**

(గత సంచిక తరువాయి)

04-03-1912

నా భార్య బాబా పూజకు ఆలస్యంగా వెళ్లింది. కానీ సాయిసాహెబ్ ఎంతో దయతో తన భోజనాన్ని కూడా విడిచిపెట్టి, ఆమె పూజను స్వీకరించారు.

06-03-1912

మేము కూటస్థదీప్ పూర్తి చేసి ధ్యానదీప్‌లోకి వచ్చాము. క్లాసు తర్వాత మామూలుగా మసీదుకు వెళ్లాను. సాయిబాబా మంచి మూడ్‌లో ఉన్నారు. అంచేత నేను సేవ చేస్తూ కూర్చున్నాను. ఆయన తన రొమ్ము మెడ క్రింది భాగం గట్టిగా కట్టేసినట్లుగా అనిపించిందన్నారు. నాగవల్లి ఆకులు కళ్ల మీద పెట్టి ఉంచుకొని తెరిచాక విషయం ఏమిటని చూచారు. ఆయనకు అర్థం కానిదేదో కనిపిస్తే ఆశ్చర్యపోయారు. ఆయన దాని కాలేదో పట్టుకున్నారు. అప్పుడది క్రిందపడింది. మంట వెలిగిద్దామనుకున్నారు. కాని కట్టెలు పూర్తిగా పొడిగా లేవు. అందుకని మండలేదు. ఆయనకు నాలుగు శవాలు కనిపించినాయి- అవి ఎవరివో అర్థం కాలేదు. సాయిబాబా తన పై దవడ క్రింది దవడ చాలా నొప్పిగా ఉన్నాయనీ, కనీసం నీళ్లు కూడా తాగలేకపోతున్నామనీ అంటూ బాధతోనే మాట్లాడుతున్నారు.

07-03-1912

నేను కాకడహారతికి వెళ్లాను. సాయిమహరాజ్ ప్రసన్నంగా ఉన్నారు. చావడి





వదలి నాట్యం చేస్తూ మసీదు వైపు వెళ్లారు.

08-03-1912

ఉదయం భీష్మ, బంధూ పెందలకడే లేచి సంగీతంతో ప్రార్థన చేశారు. నా ప్రార్థన తర్వాత పంచదశి చదువుకున్నాం. సాయిమహరాజ్ బయటికి వెళ్లడం చూచాను. తర్వాత నేను మసీదుకు వెళ్లాను. సాయిమహరాజ్ నన్ను దయతో పేరు పెట్టి పిలిచి నేను కూర్చోగానే ఒక కథ మొదలుపెట్టారు. ఆయనకి నలుగురు సోదరులున్నారట. తాము చాలా చిన్నవారేగానీ చాలా తెలివిగలవారట, తమ పెద్ద ఇంట్లోనే కాకుండా దగ్గరే ఉన్న స్మశానంలో కూడా ఆడుకునేవారట. దాని దగ్గరలో బాగా ముసలి వాడొకడు కూర్చొని ఉండేవాడు. అతడిటు మసీదుకుగానీ, ఇటు స్మశానానికిగానీ వెళ్లేవాడు కాదు. తానున్నచోటే తనది అనే వాడు, తమ మనుషులకు ఇదంతా నచ్చలేదుగానీ సాయిబాబా స్మశానానికి కూడా వెళ్లేవారు. అక్కడ జరిగే కార్యక్రమాలను చూచేవారు కూడా. ఆ ముసలాయన ఈయన తల్లికి తండ్రి అంటే 'తాతగారని' తేలింది. సాయిబాబా ఆయన కోసం ఓ రొట్టె, దానికి తోడు మరేదైనా తీసుకువెళ్ళేవారు. ఆ ముసలాయన కుష్ఠురోగి. ఆయన చేతి వేళ్లు, బొటనవేళ్లు హీనదశలోకి వచ్చే సాయి. చివరికతను అన్నం తినటం మానేసాడు, చనిపోయాడు.

బాబా అతనికి దగ్గరలోనే ఆడుకుంటున్నారు. ఆ చావు ఆయనకంత దగ్గరగా ఉందని ఆయన అనుమానించలేదు. ఈ విషయమై తండ్రిని చూడవచ్చిన తన తల్లితో అన్నారు. సాయిబాబా వెళ్లి చూచేటప్పటికి వృద్ధుడు చనిపోయాడు. అతని శరీరం బియ్యం (అన్నంగా) మారిపోయింది. ఆ ముసలాయన బట్టల గురించి ఎవరూ పట్టించుకోలేదు. తర్వాత బియ్యం కూడా మాయమయి పోయినాయి. వృద్ధుడు మళ్లీ పుట్టాడుగానీ నీచులతో కలిసాడు. సాయిబాబా అతనికి భోజనం పెట్టాడు. వృద్ధుడు మూడోసారి కొండాజీ కుమారుడిగా పుట్టాడు. అతను సాయిబాబాతో ఆడుకునేవాడు. కొద్దినెలల క్రితమే మరణించాడు.

మధ్యాహ్నారతి సమయంలో సాయిబాబా నా దగ్గరికి వచ్చి నా ఎడమ భుజం తాకారు. తమ చెయ్యి నడుమంత ఎత్తులో పెట్టి కుర్రవాడు అని సైగ చేసారు. మరో చేత్తో ఆ మనిషి చనిపోతున్నాడని సైగ చేశారు. కళ్లతో మరేదో సైగ చేసారు కానీ నాకు అర్థం కాలేదు. దాన్ని గురించి రోజంతా మధనపడుతూనే ఉన్నాను.

(సశేషం)

# జగద్గురు తత్త్వబోధక స్వామి

**- రాబర్టో డీ నోబిలీ అనే క్రైస్తవ ఫాదరీ చరిత్ర**

**- శ్రీ దిగవల్లి శివరావుగారి కథలు-గాథలు నుండి**

(గత సంచిక తరువాయి)

## జగద్గురు 'తత్త్వబోధక స్వామి'

నోబిలీ మధురానగరానికి వచ్చిన ఒక సంవత్సరానికి 1607లో తన సోదర క్రైస్తవ మిషనరీ ఫాదరీ అయిన ఫెర్నాండెజ్‌తో సంబంధం లేకుండా తానొక క్రొత్త పంథా తొక్కి ఒక నూతన జీవిత విధానాన్ని ప్రారంభించాడు. ఇతడు మధురా నగరంలోని బ్రాహ్మణుల దగ్గరకి వెళ్ళి తాను పరంగీని కాననిన్నీ, పోర్చుగీసు జాతి వాడను కూడా కాననిన్నీ, ఇటలీ దేశానికి మకుటాయమానంగా వుండి ఒక పురాతన నాగరిక సామ్రాజ్యానికి రాజధానియైన రోము నగరంలో ఒక ఉత్తమ రాజ వంశానికి చెందిన రాజకుమారుడననిన్నీ, తనకీ ప్రపంచము మీద రోతపుట్టి వైరాగ్యం కలిగి సన్యసించితిననిన్నీ చెప్పి ఒక సన్యాసిలాగానే జీవించడం ప్రారంభించాడు. ఆ క్షణం నుంచి శూద్రసేవకుల నెవ్వరినీ తన దగ్గరికి రానివ్వక తన పరిచర్యల నిమిత్తం బ్రాహ్మణులనే నియోగించాడు. ఒక్కపూట మాత్రం





ఇంత అన్నమూ, పాలూ, కూరగాయలూ పుచ్చుకొని నియమంగా ఉండేవాడు. బ్రాహ్మణ అగ్రహారంలో ఒక సంపన్నుని ఆశ్రయించి, కొంత స్థలం పుచ్చుకొని తనతోడి క్రైస్తవ మత ప్రచారకుడితో సంబంధం లేకుండా అక్కడ ఒక పూరి యిల్లు వేసుకొని అందులో నివసించడం ప్రారంభించాడు. ఈ యింటిని మధురా నగరాధికారే యిచ్చాడని ఫాదర్ గుర్రెయిరో వ్రాశాడు.

'నోబిలీ బ్రాహ్మణ ఆచారాలన్నీ అవలంబించాడు. తన పరిచర్యల నిమిత్తం బ్రాహ్మణులనే నియోగించాడు. తాను రోము నగరాన్నుంచి వచ్చిన ఒక ద్విజుడనని, సన్యాసినని చెపుతూ అందుకనుగుణ్యంగా ఈ దేశపు బ్రాహ్మణ సన్యాసులలాగానే ఐరోపా జాతి వారితోగాని, అస్పృశ్యులతో గాని సంపర్కం లేకుండా ఏకాంతవాసం చెయ్యడం ప్రారంభించాడు' అని జాన్ డిబ్రిటో అనే క్రైస్తవ మతాచార్యుడు వ్రాసియున్నాడు. త్వరలోనే ఈ నోబిలీ కేవలమూ ఒక బ్రాహ్మణవేదాంతిగా మారిపోయినాడని రాష్ట్రీయ క్రైస్తవ మతాధికారియైన ఫ్రాన్సిస్కోరోస్‌గారు అన్నారు. క్రైస్తవ మత ప్రచారకుడైన ఫాదరు రాబర్టో డీ నోబిలీ అచిరకాలములోనే 'జగద్గురు తత్వబోధకస్వామి' అనే నూతన నామకరణంతో ప్రసిద్ధికెక్కాడు.

1607 డిసెంబరు 1వ తేదీన కార్డినల్ బెల్లార్మినో గారికి నోబిలీ వ్రాసిన రహస్య లేఖలో అతడు ఇలాగ అన్నాడు. "ఇప్పడు నేను చుట్టూ మట్టిగోడలు గల పూరిపాకలో వాసం చేస్తున్నాను. దివ్యసౌధం కంటె నాకిదే ఆనందకరంగా ఉంది. ఈశ్వరసేవ కోసం ఈ విధంగా దేశాంతరంలో ఏకాంతవాసం చెయ్యడంలో ఉండే మానసిక శాంతి ఇంకొక దానిలో లేదు. అయినా నేను పూనిన ఈ దీక్షలో వుండే శ్రమ ఒక్కొక్కప్పడు చాలా బాధాకరంగా ఉంటున్నది. నా యావజ్జీవమూ ఇలాగ శ్రమపడాలేమోననే ఆలోచన వల్ల చివరదాకా నిగ్రహించలేనేమోనని


ఒక్కొక్కప్పుడు అధైర్యం కలుగుతూ ఉంటుంది. నా నిత్యజీవితం ఇలాగ జరుగుతూ ఉంది; ప్రొద్దున్న నుంచి సాయంత్రందాకా ఎక్కడికీ కదలకుండా నేను నా యింట్లోనే కాలక్షేపం చేస్తూ ఉంటాను. నాతో ఎవరైనా మాట్లాడడానికిగానీ, చర్చించడానికిగాని వస్తే నేను ఈశ్వర ప్రార్థనము చేసిన తరువాత వాళ్ళకు దర్శనమిస్తాను. దేశీయులలో ప్రబలి యున్న పొరబాటు మత సిద్ధాంతాలను ఖండిస్తూ దేశభాషలో వ్రాసేటందుకు మిగతా కొద్దికాలాన్ని వినియోగిస్తూ ఉంటాను. నేను ఎల్లప్పుడూ నా యింటిలోని చిన్న గదిలోనే కాలక్షేపం చేస్తూ ఉన్నందు వల్లనూ, మాంసముగాని, కోడిగ్రుడ్లుగాని నా గడపలోకి రావడానికి వీలు లేదని నేను నిషేధించినందువల్లను, నేను తినే ఆహారము నాకు తగిన బలమునివ్వనందువల్లనూ, నాకు ఎప్పుడూ ఏదో జబ్బుగానే ఉంటూ ఉన్నది. నా కడుపులోనో, తలలోనో నొప్పి లేకుండా ఉన్న రోజులు బహు తక్కువ. నేను తినే ఆహారము వరి అన్నమూ, కూరగాయలూ, పళ్ళూను. నేను యివి తప్ప ఇంకొకటి తినకూడదు. ఈ దేశంలో తత్వబోధ చేసే మతాచార్యులూ, సన్యాసులూ ఇంకా కఠినమైన యమ నియమాలతో జీవిస్తారు. ఒక్క మెతుకు అన్నమైనా తిననివాళ్ళు గూడా ఉన్నారు. ఈ దేశం ప్రజలు నానురొట్టె తినడం ఎరుగనే ఎరుగరు. ఇక మద్యం అనగా సారాయమును 'మాస్' అనే క్రైస్తవ ప్రార్థన నిమిత్తం మాత్రమే నేను ఉపయోగిస్తున్నాను. అన్నం గూడా వర్జిస్తే ఇక మనిషి తినే ఆహారం ఎంత స్వల్పంగా ఉంటుందో ఊహించండి. అన్నం వర్జించడానికి నేను సాహసించలేదు. ఇప్పుడు నేను పెట్టుకున్న నియమాలే-అనగా మాంసము, చేపలు, గ్రుడ్లు వర్జించడమే నేను నిజమైన మతాచార్యుడనని ప్రజలు అనుకునేటందుకు చాలును. ఈ ఉత్తరం వ్రాస్తూ ఉన్న సమయంలో నేను ఉబ్బసం, దగ్గు వల్ల ఊపిరి ఆడక బాధపడుతున్నాను. అందువల్ల దీనిని మెల్లమెల్లగా వ్రాస్తున్నాను".

**(సశేషం)**





# శుకవాణి



**- మాతాజీ**

శ్రీకృష్ణుని నిర్యాణవార్త మోసుకువచ్చిన అర్జునుని చూచాడు ధర్మరాజు. అర్జునుడు మహావీరుడు. పాశుపతాస్త్రం కోసం తపస్సు చేస్తుండగా అతన్ని పరీక్షించడానికి శివుడు కోయ రూపంలో వచ్చాడు. ఇద్దరూ ఒకే అడవి పందిని ఒకేసారి కొట్టారు. రెండు బాణాలూ తగిలి పంది మరణించింది. దానిపై హక్కు నాది నాదని ఇద్దరూ హొరాహొరీ పోరాడారు. చివరికి పరమశివుడు పార్థుని యోగ్యతకు సంతోషించి తన పాశుపతాస్త్రాన్ని అతనికి ఇచ్చాడు. అంతటి యోద్ధ. అర్జునుడు ఎన్నడూ భీతీ, వెఱపూ ఎరుగనివాడు. అలాంటివాడు యిలా చిన్నబుచ్చుకొని ఎందుకున్నాడు? "శ్రీహరి, బంధుబలగం అంతా క్షేమమే గదా! అక్కడి పెద్దలంతా కుశలమేనా? యాదవులంతా బాగున్నారా?" ఇవన్నీ అడుగుతున్నప్పటికీ అర్జునుడు నీరు నిండిన కన్నులతో అన్నగారివైపు చూస్తున్నాడేగానీ పెదవి విప్పి మాట్లాడలేకపోతున్నాడు. అది చూచి ధర్మరాజు "ఎన్నడూ లేని యీ కన్నీరేమిటి నాయనా! ఏదైనా పొరపాటు చేసావా?" అంటూ క్రింది మాటలన్నాడు.

"ఓడితివో శత్రువులకు, నాడితివో సాధు దూషణాలాపంబుల్
కూడితివో పరసతులను, వీడితివో మానధనము వీరుల నడుమన్.
తప్పితివో యిచ్చెదనని, చెప్పితివో కపట సాక్షి, చేసిన మేలుం
దప్పితివో? శరణార్థుల రొప్పితివో? ద్విజుల(, బసుల, రోగుల, సతులన్.
అడిచితివో భూసురులను(, గుడిచితివో బాల, వృద్ధ గురువులు వెలిగా
విడిచితివో ఆశ్రితులను, ముడిచితివో పరుల విత్తములు లోభమునన్"
"వైరుల చేతిలో ఓడావా? సజ్జనులను, సాధువులను నిందా వాక్యాలు

పలికావా? పరకాంతల జోలికి వెళ్లి, అనుచితంగా ప్రవర్తించావా? నీ సాటి వీరుల మధ్యలో అవమానపడవలసిన పని ఏదైనా చేసావా? యాచకులై వచ్చిన వారికి దానమిస్తానని చెప్పి వెనుదిరిగావా? ఏదైనా కూట సాక్ష్యం (తప్పడు సాక్ష్యం) యిచ్చావా? ఎవరికైనా రవంత మేలు చేసి, గొప్పగా-ఆడంబరంగా వాళ్లను దెప్పిపొడుస్తున్నావా? నేను చేసాను నేను చేసానని పదేపదే పలికి ఆ ఉపకార గ్రహీతను చిన్నబుచ్చుతున్నావా? రక్షించమని వచ్చి శరణుకోరిన బ్రాహ్మణులను (సాధు వర్తనులను), పశువులను (స్వయం రక్షక శక్తి లేని వాటిని), వ్యాధిగ్రస్తులై నిస్సహాయంగా పడి ఉన్న వారిని, స్త్రీలను (కన్నీరు పెట్టించరానివారిని) కోపంతో తరిమేసావా? బ్రాహ్మణులను హింసించావా? తొలుత భోజనం పెట్టవలసిన చిన్న పిల్లలను, వృద్ధులను, గౌరవనీయులైన గురుజనులను విడిచి నీవే ముందుగా తిన్నావా? నీ మీద ఆధారపడి ఉన్న వారిని వారి కర్మానికి వారిని వదిలేసావా? దురాశతో పరుల ద్రవ్యాన్ని లాక్కున్నావా? ఏమి చేసావో చెప్ప. కాకపోతే నీకింత దుఃఖం ఎందుకు కలిగిందయ్యా అర్జునా!"

ధనం కోల్పోతే ఏమీ పోయినట్లు కాదు -

ఆరోగ్యం పోతే ఏదో కొంత కోల్పోయినట్లు -


కానీ శీలంపోతే సమస్తమూ పోయినట్లే" అన్న సూక్తి మనందరికీ తెలిసిందే. కనుక సాధకులైన వారంతా దేనికి దుఃఖించాలో, దేనికి దుఃఖించనక్కరలేదో గ్రహించి, అశాశ్వతాలైన ధనాదికాల కోసం, బంధు మిత్రుల కోసం కాక-తాను సచ్ఛీలం, సౌశీల్యం కోల్పోయే చర్యలు చేసినపుడు-తన ఆత్మోన్నతికి తానే గొడ్డలిపెట్టు పెట్టుకుంటున్నానే అని దుఃఖించడం నేర్చుకొందాం. మనను మనం సంస్కరించుకొందాం. పై పద్యసారాన్ని మన వాళ్లక్కూడా నేర్పదాం.





# అందరమూ ఆ సన్నిధికే చేరాలి





ప్రియ మిత్రులారా,

మరో **ఫాల్గుణ బహుళ విదియ మార్చి 25వ తేదీన** వస్తున్నది. మన గురుదేవులు భౌతికంగా లేరిప్పుడు. వారి జన్మదినం వస్తోంది. శ్రీరాముడు లేని శ్రీరామనవమి, కన్నయ్యలేని కృష్ణాష్టమి, దత్తుడు లేని దత్తజయంతి ఎలా జరుపుకొంటామో-అలాగే గురుదేవుల చిచ్ఛక్తిని స్మరిస్తూ వారి జన్మదినం ఆ రోజు జరుపుకొందాం. వారి ప్రేమ, కరుణ, బోధ, ప్రసన్నతలు కలబోసిన జీవితాన్ని అందరం కలిసి స్మరించుకొందాం. జ్ఞానధామంలో గురుదేవులు శయనించినచోట తలవాల్చి నమస్కరించుకొందాం. బాధ కలిగితే ఒకరినొకరు ఓదార్చు కొందాం. అందరం ప్రేమమయులైన ఆ స్వామి పాతికేళ్లు నడయాడిన సాయిధామానికి వచ్చి, ఆయన చెంత కొన్ని గంటలు గడిపి, వారి స్మృతులు కలబోసుకొని ధన్యులమవుదాం. కార్యక్రమం యిలా రూపొందించుకొంటున్నాం.

**మార్చి 25** ఉదయం 8-00 శ్రీ సాయి పూజ

గం.8-30-9-30 విష్ణు సహస్ర నామం, సాయిచాలీసా పారాయణ, భజన

గం.10-00 శ్రీ గురుదేవులకు పాదుకాపూజ, గురుసంస్తుతి

గం.10-30 భక్తుల భావ పరంపర

గం.11-30 ప్రవచనం, గురు నమస్కృతి

గం.12-00 మహా హారతి

గం. 1-00 అన్నప్రసాద వితరణ

అందరూ తరలిరండి-జ్ఞానధామాన్ని దర్శించి, గురుదేవుల సంస్మరణతో పునీతులు కండి.

**ప్రేమతో ఆహ్వానిస్తూ,**
**గురుచరణ స్మరణతో,**
**ధర్మాధికారి, సాయిధామం**

# గురువుగారితో కబుర్లు

గురువుగారండీ! మీ చరణస్పర్శతో పావనమైన మీ గదిలో మీ చిత్ర పటం ముందు మనసా సాష్టాంగపడి ప్రణమిల్లుతున్నాను. సాయంత్రమయ్యే సరికి ఒక్క సౌమనస్యపు పలుకైనా లేక-ఒక్క చల్లని కటాక్ష స్పర్శైనా తాకక-మనస్సు నీరవమై భాగవతం తెరిచానీవేళ. తీస్తూనే శ్రీకృష్ణ నిర్యాణ వార్త అర్జునుడు ధర్మజునికి చెప్తున్న ఘట్టం వచ్చింది.

"కన్నీరు కరతలమున దుడిచికొనుచు, గద్గద స్వరంబున-మహానిధి గోలుపోయిన పేద చందంబున"-అర్జునుడు అన్న మాటలు చూడండి-

"మన సారథి, మన సచివుడు, మన వియ్యము, మన సఖుండు,
మన బాంధవుడున్
మన విభుడు, గురువు, దేవర మనలను దిగనాడి - చనియె
మనుజాధీశా!"

గురువుగారూ! ఇవి నరుని పలుకులు-కానీ నా పలుకుల్లాగా లేవూ? మా జీవనరథాలను సక్రమమార్గాల నడిపి, లాలసలనే కౌరవులపై యుద్ధానికి మమ్మల్ని నడిపించిన సారథి మీరు. ఇంటివైనా, సంస్థవైనా-ఎలాటి సమస్యలనైనా పరిష్కరించుకొనేందుకు త్రోవచూపిన మహామంత్రి మీరు. ఇక సఖులంటారా-"అఘము వలన మరల్చు, హితార్థ కలితుజేయు" మిత్రుడు మీకన్నా ఎవరున్నారు మాకు! మాలోని లవలేశపు సద్గుణాలను పోషించి పెంచే ప్రయత్నం చేసి, సంసార కూపాలలో కూరుకుపోయే మాకు చేయందించిన మిత్రులు మీకన్నా ఎవరున్నారు మాకు! "ఒకపరి నీ నామపు రుచి తెలిసేనా యింకొక తావున మది నిలిచేనా!" అని ఎప్పడో వ్రాసాను గదా మిత్రమా! మీరు పరిచయమయ్యాక, మీ చరణఛాయలోకి వచ్చాక-మాకు బంధువు లెవరు మిగిలారు గురువుగారూ! అప్పడప్పడూ సరదాగా "వేములవాడ భీమకవి చేసిన జోగి నేను" అన్న పోతరాజు





మాటలు కోట్ చేసేదాన్ని గదా! తాను దరిజేర్చుకోదలచిన వారిని సర్వబంధాల నుండీ విముక్తులను చేస్తానని కృష్ణుడు గీతలో చెప్పాడు గదా! గీతలోనే కాదు-వామనావతార ఘట్టంలో (14 నుండి 18 ఫిబ్రవరి వరకు నాలుగు రోజులు సాయంత్రాలలో యిది కథా కాలక్షేపంగా చెప్పకున్నాం) "ఎవ్వని కరుణింప నిశ్చయించితి వాని యఖిల విత్తంబునే నపహరింతు" అని తేటతెల్లంగా చెప్పాడు గదా వామనుడు. "విత్తంబు అన్న దానికి సర్వసంపత్తులు" అని అర్థం గదా!

మీరు మాకు గురుదేవులు. మీరు చేసిందీ అదే. మాకు మిగిలిన బంధువు మీరొక్కరే. మా ప్రభువు మీరే! (అవునూ-మీపేరు కూడా ప్రభుజీయేగా!) మీరే మా అజ్ఞాన తమస్సును తుడిచే ప్రయత్నం చేసిన సద్గురువు. కబీరు చెప్పారు- "గురువూ, భగవంతుడు ఒకేసారి ప్రత్యక్షమైతే-ముందు గురువుకే నమస్కరిస్తాను, ఎందుకంటే దైవాన్ని చూడటం నేర్పినది గురువే గదా!" అని. నేనేమో స్వయంగా తాను రాలేక నాకోసం దైవం పంపిన ప్రతిరూపంగానే భావించాను. మిమ్మల్ని మీరే స్వయం సాయిదేవులనుకొంటే మరి వేరే దైవమేదీ? "ఇన్ని రూపుల గనిపింతు వెన్నగాను" అని ఎప్పడో వ్రాసుకొన్నదే గదా! ఇన్ని రూపులొక్కసారి కరిగిపోతే-కనుల ముందు శూన్యమేగదా గురువు గారూ! ఎలా భరించమంటారు? ఆ శూన్యాన్ని నింపగల సాధన మాకు అందించండి. మీరు అప్పగించి వెళ్ళిన పనులు పూర్తి చెయ్యాలంటే మీరు నిత్యం నాతో ఉన్నారన్న స్పృహ కలిగేలాగా-నిత్యం ఒక్కసారైనా, అలవోకగా నైనా, కలనైనా అలా.... కన్పించాలి గదా గురుదేవా! ఆ వరమివ్వరూ మీ పిచ్చితల్లికి!

**మహాశివరాత్రినాడు సాధకులకు కామవిజేత మృత్యుంజయుడు**
**అలికాన కంటినీ, కంఠాన కాలకూటాన్నీ దాచినట్టి**
**పరమశివుని ఆశీస్సులు లభించుగాక!**

# మాతృసంస్థ కబుర్లు

జనవరి 23వ తేదీన శ్రీరామ్‌నగర్ కాలనీ (హైదరాబాదు)లో కాళీ ప్రసాద ఆశ్రమానికి వెళ్ళారు ఆశ్రమవాసులు కొందరు. ఆ ఆశ్రమ అధిపతిగా వ్యవహరిస్తున్న శ్రీశ్రీశ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ దర్శనం చేసుకొని అక్కడి సత్సంగ విశేషాలు చూడాలన్నది పైకి కనిపించిన (పోనీ అందరికీ చెప్పిన) కారణం. పాతికేళ్ళ గురుసాన్నిధ్యం కోల్పోయినందుకు మాకే యింత వెలితీ, దుఃఖం కలుగుతున్నాయే- ఆరునెలలు దాటినా గాయపు పచ్చిదనం రవంతైన మానటం లేదే- పైగా పెరుగుతోందే! మరి మూడేళ్ళ శైశవం నుంచి ముప్పై రెండేళ్ళకు పైగా ఆ సాన్నిధ్య మాధుర్యాన్ని అనుభవించిన ఆ తల్లి చంద్ర కాళీమాత తమ గురువు వియోగాన్ని ఎలా తట్టుకున్నారన్న రహస్యాన్ని అడిగి తెలుసుకోవాలన్నదే అసలు ఉద్దేశ్యం. ఉదయ పూజ, భజన తర్వాత రుక్మిణీ కళ్యాణఘట్టం పురాణప్రవచనం జరిగింది. అటుపై మధ్యాహ్నహారతి. తదుపరి మాతాజీ మమ్మల్ని తమ గదికి పిలిపించారు. ఆమె చాలా సహజంగా, సరళంగా, ఆప్తతతో మాట్లాడారు. గురుదేవుల గురించీ, ఆశ్రమం గురించీ అడిగి తెలుసుకున్నారు. తమ ఆశ్రమం గురించీ, పర్యటనల గురించీ వివరంగా చెప్పారు. "గురు శక్తి, గురు ప్రేమ నిరంతర స్రోతస్సులు" అంటూ "గురువులు మనలని వదిలి ఎక్కడికి పోరమ్మా!, వాళ్ళు మాత్రం మనల్ని వదిలి ఎలా ఉండగలరూ!" అన్నారు. ఆ మాట వినగానే అందరికీ మనసు తేలికైంది. కాని కళ్ళు మాత్రం వర్షించాయి.

ఆనాడు వారు చూపిన ఆదరణతో మళ్ళీ చూడాలనిపించి 25వ తేది సాయంత్రం తిరిగి వెళ్ళాం. ఈసారి వారు తమ ఉపన్యాసంలో సాయిధామం ఆశ్రమం గురించి శ్రోతలకు పరిచయం చేశారు. "గురుశక్తి





సాయిధామంలో స్వామీ సత్యపదానంద ప్రభుజీ అనే పేరిట ప్రకాశించింది మొన్నటి వరకు. నీళ్ళల్లో కొట్టుకుపోయే రెండు కట్టెపుల్లలు ఒక చోటుకు చేరినట్లు తమ గురువుకు దూరమైన ఆశ్రమవాసులు సమ దుఃఖంతో ఉన్న మనను కలవడానికి వచ్చారు. ఇప్పుడు మాతాజీగారు మనకు కొన్ని సద్విషయాలు చెప్తారు. వారు విద్యాధికులు కూడా" అంటూ మాతా శుకవాణిగారిని వేదికపైకి ఆహ్వానించారు వారు. "మనం లౌకికంగా మనకు దగ్గరైన వారిని, వారు చేసిన ఉపకారాలనూ గుర్తు పెట్టుకుంటాం గానీ వారిచేత మనకు అలా చేయించిన అసలుసిసలు ఆప్తుడిని మాత్రం మర్చిపోతుంటాం" అంటూ అద్భుతమైన ముక్కుపుడక చేసినందుకు తనను సన్మానిస్తామన్న గ్రామీణులతో ఆ సన్మానం చేయవలసింది పుడక చేసిన వాడికి కాదు-ముక్కు చేసిన వాడికి అని చెప్పిన కంసాలి కథ చెప్పారు. విశ్వమంతటికీ రక్షకుడు భగవంతుడై ఉండగా మరెవ్వరెవ్వ రినో నమ్ముకొని జీవించడం అవివేకం అని చెప్తూ తన బొమ్మ అద్దంలో బాగా కనపడాలంటే-తాను బాగుండాలే తప్ప అద్దం తుడిచి ప్రయోజనం లేదని వివరించారు. అలాగే గురుదేవులు మనిషికుండవలసిన స్థితప్రజ్ఞత్వం గురించి కృష్ణుడిని ఉదాహరణగా ఎలా చెప్పేవారో వివరించారు.

తరువాత చంద్రకళ మాతాజీ వారు గురుశక్తి గురించీ, బ్రహ్మజ్ఞాని లక్షణాలను గురించీ చక్కని కీర్తనలతో, ఉదాహరణలతో చక్కగా వివరించారు. ఖంగుమనే గొంతుతో వారు పాడిన పాటలు వీనుల విందు చేశాయి. అటుపైన ప్రసాదం తీసుకొని సాయిధామానికి తిరిగి వచ్చాము.

శ్రీశ్రీశ్రీ నిర్మల యోగభారతి మాతాజీవారు తమ శిష్యులు శ్రీ లక్ష్మీ నారాయణగారితో కలిసి సాయిధామం ఆశ్రమానికి విచ్చేసారు. గురుదేవుల మండలారాధన తరువాత వారిని చూడడం ఆశ్రమవాసులకు ఎంతో ఆనందం కలిగించింది. కొంతసేపు సత్సంగం తరువాత వారు చిరంజీవు

లను ఆశీర్వదించి వెళ్ళారు. తిరిగి పదవ తేదీన రాము మాతాజీ కలిసి వారి దగ్గరకు వెళ్ళి కొంతసేపు సద్విషయ విచారణతో గడిపి వచ్చారు.

జనవరి 28వ తేదీన రాము, మాతాజీ కలిసి శ్రీశ్రీశ్రీ మాతా చిత్స్వరూపానంద వారి దగ్గర ఒక పగలంతా గడిపి వచ్చారు. మాతాజీవారు గురుదేవుల సారళ్యాన్ని, సౌదర్యాన్ని పదేపదే గుర్తు చేసుకున్నారు. గురుదేవుల మంచితనం గురించీ, శక్తి గురించీ, దేశాభిమానం గురించీ ఎన్నో విషయాలు కలబోసుకున్నాం. మాతాజీగారు ఈశావాస్యోపనిషత్తు లోని తొలి మంత్రం గురించి దాదాపు అరగంటసేపు చక్కగా వివరించారు. మధ్యాహ్న భోజనాదికాలు కూడా వారి దగ్గరే చేశాం. తిరిగి వచ్చేటప్పడు వారు ఒక మాట అన్నారు "ప్రభుజీగారి సాత్వికత, ప్రసన్నత గొప్పవే. కానీ వారు రవంత గట్టిగా ఉంటే కాస్త బాగుండేది". "నా గురువు హృదయం మకరందపు ధుని. అందులో కారానికి తావే లేదు. వారి సహజ పరిపాకం అది" - అన్నది శుకవాణి.

జనవరి 26వ తేదీన ప్రతి ఏటా జరిగినట్లే గణతంత్ర దినోత్సవపు వేడుకలు-పతాక వందనం, సాంస్కృతిక కార్యక్రమాలు, పెద్దల దేశభక్తి పూర్వక ఉపన్యాసాలు, మిఠాయిల పంపకంతో జరిగాయి.

జనవరి ముప్ఫై ఒకటవ తేదీ సాయినాథ క్షేత్రంలో పూజారి చి॥ సాయి రమణ దంపతులు తమ కొడుకు చిరంజీవి సాయిప్రభుజీకి అన్నప్రాశన ఉత్సవం నిర్వహించుకున్నారు. ఆ సందర్భంగా మాతాజీ, ఆనందంగారు, రాము, చిరకాల మిత్రులు యశోద, పద్మారావు, బ్రహ్మారెడ్డి, ఇందిరలు అక్కడికి తరలివెళ్ళారు. సాయిరమణ దంపతులు పుత్రసమేతుడై కూర్చోగా రాంబాబు వారిచేత పూజ చేయించాడు. తరువాత చి॥ సాయిప్రభుజీని బాబా ఎదురుగా పడుకోబెట్టి అతని ముందు వెండి, బంగారం, పుస్తకం, కలం, బాబా విగ్రహం, ఆట వస్తువులు, జపమాల, వెయ్యి రూపాయల నోటు పెట్టారు. అతని పేరు గురుదేవులదే కావడంతో అందరూ ఏం





పట్టుకుంటాడా! అని ఆసక్తితో చూస్తున్నారు. ఆ పుష్టి బ్రాండు పిల్లవాడు దాదాపు ఏడెనిమిది నిమిషాలపాటు అన్నిటినీ పరిశీలించాడు. కుడిచేతికి దగ్గరలో నోటున్నది. వాడు అదే పట్టుకుంటాడని అందరూ అనుకుంటున్నారు. "తాత కోటేశ్వరరావు బుద్ధే" అని వరుసైనవారు హాస్యాలాడుతున్నారు. అంతలో చిట్టి ప్రభుజీ గభాల్న ఎడమచేయి చాపి జపమాల ఒడిసి పట్టుకున్నాడు. ఆశ్రమవాసులంతా హర్షధ్వానాలు చేసారు. తాతగారికి భావోద్విగ్నతతో కన్నీరు వచ్చింది. అటుపైన చిరంజీవికి అన్నప్రాశన, ఆశీర్వచనాలు జరిగాయి. భోజనాల వేళ మాతాజీ అక్కడ చిరకాలంగా గురువుగారితో అనుబంధం ఉన్న మాతృమూర్తులతో కొంతసేపు మాట్లాడారు. గురుదేవులు లేకుండా ఆశ్రమానికి వెళ్ళడం అదే మొదటిసారి గనుక దుఃఖోద్విగ్నత ఉన్నప్పటికీ గురుసోదరుల కలయిక కొంత ప్రశాంతత కలిగించింది.

ఫిబ్రవరి 13వ తేదీ ఉదయం శ్రీశ్రీ మాతా నిర్మలయోగభారతి వారు సాయిధామానికి విచ్చేసారు. గురుదేవుల జ్ఞానధామానికి ద్వారం ఎత్తాలి. దానికి పూజాదికాలు వేదమంత్ర పూర్వకంగా జరిపారు. ద్వారబంధం నిలిపాక మాతాజీగారు తమ శిష్యురాండ్రైన చి॥ సునీత, చి॥ గౌతమిలతో కలిసి యజ్ఞం ప్రారంభించారు. ఆరోజు వసంతపంచమి గనుకనూ, రాముకు యోగదర్శన్ తరగతులు ప్రారంభమౌతాయి గనుకనూ సరస్వతీ యజ్ఞం చేసారు. యజ్ఞప్రయోజనాన్నీ, సరస్వతీ వైభవాన్నీ చక్కగా వివరించి చెపుతూ యజ్ఞం చేయించారువారు. ఆశీర్వచనానంతరం 'యోగదర్శన' పాఠం ప్రారంభమైంది. "అథయోగానుశాసనమ్", యోగశ్చిత్త వృత్తి నిరోధః". ఈ రెండు సూత్రాలను వ్యాసభాష్యంతోపాటు వివరిస్తూ సుమారు గంటసేపు చెప్పారు. అటుపైన భోజనాలు చేసి మాతాజీ పరివారంతోసహా వెళ్ళిపోయారు. దాదాపు రోజంతా గురుస్మరణతో నడిచింది.

# DECLARATION

Statement about ownership and other particulars about **"Sachidananda Sadguru Sai Vani".**

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Hyderabad |
| 2. Periodicity of publication | : | Monthly |
| 3. Printer's Name | : | V.V. Krishna Rao |
| Nationality | : | Indian |
| Address | : | Sai Sri Printers, 8-3-945, Shop No. 21, Pancom Business Centre, Ameerpet, Hyderabad - 500 016 (A.P.) |
| 4. Publisher's Name | : | Mata Sukavani |
| Nationality | : | Indian |
| Address | : | Saidhamam, Nalgonda Dist, Pin - 508 126 |
| 5. Editor's Name | : | Mata Sukavani |
| Nationality | : | Indian |
| Address | : | Saidhamam, Nalgonda Dt, Pin- 508 126 |
| 6. Owner's Name | : | Sai Vani Publications, Saidhamam, Nalgonda Dist - 508 126 |

I, Mata Sukavani declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 01-03-2016

Sd/-

Mata Sukavani





# శిలారోదనం-1

**- భేరి సోమన్న**

("శిలకు స్పందన లేదన్న మీ మాటకు స్పందించి యివి పంపుతున్నాను మాతాజీ!" అంటూ యీ పద్యాలు పంపారు శ్రీ భేరి సోమన్న (వింగ్ కమాండర్ -భారత వైమానిక దళం)గారు. శిలలను మానవీకరించి, నోరిచ్చి, తమ కలం అప్పుగా యిచ్చి శ్రీ సోమన్నగారు పంపిన ఈ పద్యాల తెలుగుదనాన్ని ఆనందించండి. **- (ప్రధాన సంపాదకులు)**

నరుడు విలపించు నను మాట నమ్మినావు,
పూలు విలపించు ననుపాట పొగడినావు,
శిలలు విలపించుననగానె చిలిపి నవ్వు
లొలుక జరుగని పనియంచు పలికెదేల! 1

సూర్యుడస్త్రాద్రి చాటుకు సోలినపుడు
దిశలు విలపించు తమకింక దిక్కులేక
కీచురొదలతో నప్పుడే 'గీ' యటంచు
శిలలు విలపించు, నాలింప చెవులు వలయు. 2

ఎందుకేడ్తురు కారణంబెవరటంచు
పప్పరుబ్బుచు రోటిని పలుకరింప,
నంగనాచి నరుడవంచు, దొంగవంచు
రాళ్ళునను తిట్టి హీన స్వరాన పలికె. 3

నరుడు పుట్టిన దాదిగా పరికరములు,
గూడు కల్పించి, తోడుగా కూడియుండి
శక్తి వంచన లేకుండ సలుపసేవ
తెలుసుకొనలేదు, దానికై దిగులు లేదు. 4

**(సశేషం)**